ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025 5
శ్రీ సత్యసాయి

వీరజవాను పార్థివదేహాన్ని కళ్లతండాకు తీసుకువస్తున్న వాహనం

చి'వరి'కి ఎదురు చూపే..!

పంట కొనేవారు లేక రైతుల అవస్థలు

20 రోజులుగా కల్లాల్లోనే వరిపంట

అరకొరగా చేతికొచ్చిన పంటను కొనే వారు కరువు

కొనుగోలు దారులు రాకపోవటంతో పొలంలో నిల్వ ఉంచి వరిధాన్యం

పొలంలోనే నిల్వ ఉంచిన వరిధాన్యం

ప్రజాశక్తి-బొమ్మనహల్

ఆరుగాలం పంట సాగు చేసిన రైతుకు చి'వరి'లోనూ కష్టాలు తప్పడం లేదు. కోత కోసి కుప్పలుగా సిద్ధంగా ఉంచిన పంటను కొనేవారి కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలో వరి రైతులు గత 20 రోజులుగా వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. బొమ్మనహాల్ మండంలోని పలు గ్రామాల్లో బోరుబావుల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో వరిపంట పెద్ద ఎత్తున నేలవాలింది. అకాల వర్షాన్ని తట్టుకుని చేతికొచ్చిన అరాకొర పంటను కొనేవారు లేక రైతులు వ్యాపారులు, ప్రభుత్వంపై ఆశగా ఎదురు చూస్తున్నారు. మండల పరిధిలోని లింగదహాల్, కలగాలని, గోనేహాళ్, శ్రీధరగట్ట, బండూరు, బొమ్మనహాల్, ఉప్పరహాల్, కృష్ణాపురం, గోవింద వాడ, గౌనూరు గ్రామాల్లో వరి పంటను కోత కోసి కుప్పలు వేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఒక ఎకరాకు 20 కింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా అకాల వర్షాలు, తెగుళ్లతో 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఉన్న అరకొర పంటను కూడా కొనే వారు లేక గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని కల్లాల్లో వేసుకుని దానికి కాపలాగా అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే ధాన్యం కుప్పలను కప్పుకునేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. గతేడాది ప్రభుత్వం క్వింటా రూ.2250తో కొనుగోలు చేసింది. ప్రస్తుతం రూ.1500, నుంచి రూ.1800కు మించి వ్యాపారులు అడగడం లేదు. ఈ ధరతో పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఉంటుంది. బొమ్మనహాల్ మండలంలో స్థానికంగా మార్కెట్‌యార్డు లేకపోవడంతో పంట నిల్వకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కర్నాటక నుంచి కొందరు వ్యాపారులు పంటను కొనేందుకు వస్తున్నా వారు అప్పు అడుగుతున్నారు. గతంలో ఇలా కర్నాటక నుంచి వచ్చిన వ్యాపారులు అప్పుగా పంటను తీసుకెళ్లి తర్వాత డబ్బులు ఇవ్వకుండా ఐపి పెట్టిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి పంటను అమ్మేందుకు రైతులు భయపడుతున్నారు. స్థానికంగానే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని గతంలో రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నేటికీ నెరవేరలేదు.

ప్రభుత్వమే పంటను కొనాలి

గత జనవరిలో క్వింటా రూ.2250తో వరి అమ్ముడుపోయింది. ప్రస్తుతం ఈ ధర అటుంచి కనీసం కొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రావడం లేదు. తక్కువ ధరతో ఉన్న కాస్త పంటను కొనుగోలు చేసేందుకు దళారులు వస్తున్నారు. వీరికి పంటను అమ్మితే పెట్టుబడులు కూడా చేతికిరావు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలి

గొల్ల లింగన్న,
లింగదహాళ్ గ్రామం.

కొనేవారి కోసం ఎదురుచూస్తున్నాం..

ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. డీఏపీ, యూరియా కాంప్లెక్స్ ఎరువులను ప్రతి సంవత్సరం పెంచుతూ పోతున్నారు. పంటలకు మాత్రం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు. ధరలు లేక పెట్టుబడులు కూడా చేతికందలేదు. ప్రస్తుతం వరి పంటను అమ్మకానికి సిద్ధంగా ఉంచినా కొనేవారు లేరు. కళ్లాల్లో పంటను వేసుకుని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నాం.

బోయ వన్నూరప్ప,
లింగదహాల్ గ్రామం.

'ఏకలవ్య కాలనీ..ఎరుకల జీవన గాథలు'కు సడ్లపల్లె కథా పురస్కారం

సమావేశంలో మాట్లాడుతున్న కవి, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి యేటా నిర్వహించే తరహాలోనే ఈ ఏడాది కూడా ప్రదానం చేస్తున్న సడ్లపల్లె కథా పురస్కారాన్ని చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజీ రాసిన "ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు" అనే పుస్తకం దక్కించుకుంది. ప్రముఖ రచయిత చిదంబరరెడ్డి సడ్లపల్లె కథా పురస్కారానికి 2024 వ సంవత్సరంలో అచ్చయిన కథా సంపుటాలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం తపన సాహిత్య వేదిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో విజేతల వివరాలను ఆయన ప్రకటించారు. దేశంలోని వివిధ ప్రాంతాల తెలుగు రచయితలు 50 కి పైగా కథా సంపుటాలను పంపి పోటీలో పాల్గొన్నారు. వారిలో చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజీ రాసిన "ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు" అనే పుస్తకానికి రూ.10 వేల పురస్కారం దక్కింది.అదే విధంగా తెలంగాణా రాష్ట్రం ఖమ్మ ంజిల్లాకు చెందిన స్వర్ణకిలారి "నల్లబంగారం" అనే కథల సంపుటికి రూ.5 వేల ప్రోత్సాహక పురస్కారం లభించింది. ఈ పురస్కారాలకు ఎన్నికకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి (అనంతపురం), గండేట గౌరునాయుడు (పార్వతీపురం), డాక్టర్.దేవేంద్ర (హైదరాబాదు) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఇదే సందర్భంగా "ఎయిడ్స్" గురించి విస్తృత పరిశోధనలు చేసి ప్రజావైద్యుడుగా పేరుపొందిన కాకినాడకు చెందిన డాక్టర్ యనమదల మురళీకృష్ణకు తపన సాహిత్య వేదిక సేవా పురస్కారం అందజేస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు సడ్లపల్లె చిదంబరరెడ్డి తెలియజేశారు. పురస్కారాల గ్రహీతలకు, న్యాయ నిర్ణేతలకు ధన్యవాదాలు తెలియజేశారు. విజేతలకు సన్మాన కార్యక్రమం వివరాలను త్వరలోనే తెలియజేస్తామని సడ్డపల్లె చిదంబరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు సిద్ధగిరి శ్రీనివాస్, ఆంధ్రరత్న గంగాధర్, డా.అశ్వత్థనారాయణ, యువకవి గంగాధర్, విశ్రాంత ప్రిన్సిపాల్ గంగిరెడ్డి, యన్.రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరు విమానాశ్రయంలో మురళీనాయక్ పార్థివదేహం వద్ద మంత్రి సవిత

మురళీనాయక్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్వగ్రామానికి మురళీ నాయక్ పార్థివ దేహం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన మురళీ నాయక్ పార్థివ దేహం శనివారం రాత్రికి స్వగ్రామమైన కల్లితండాకు చేరుకుంది. పార్థివ దేహం బెంగళూరు విమానాశ్రయం చేరుకోగానే అక్కడ సైన్యం గౌరవ వందనం స్వీకరించిన తరువాత అధికారిక లాంఛనలతో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అధికారులతో కలసి తీసుకున్నారు. అక్కడి నుంచి పార్థవదేహాన్ని రోడ్డు మార్గంలో గోరంట్ల మండలం కల్లితండాకు తీసుకొచ్చారు. నేడు అంత్యక్రియలు జరగనున్నాయి. మురళీ నాయక్ పార్థివ దేహాన్ని సందర్శించేందుకు పెద్దఎత్తున సందర్శకులు వచ్చే అవకాశమున్నందున కల్లితండాలో భారీ ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. ప్రముఖులు కూడా అంత్యక్రియలకు హాజరయ్యే అవకాశముండటంతో గ్రామంలో రహదారుల విస్తరణతోపాటు, పారిశుధ్యం తదితర పనులను పంచాయతీ సిబ్బంది చేపట్టారు.

పెద్దఎత్తున కొనసాగిన పరామర్శలు

మురళీ నాయక్ కుటుంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సంపత్ పరామర్శించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ సిండేతో వీడియో కాల్‌లో మాట్లాడించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపి బికె.పార్థసారథి, ప్రముఖ సింగర్ మంగ్లి పరామర్శించిన వారిలోనున్నారు.

అంత్యక్రియలు హాజరుకానున్న ప్రముఖులు

మురళీ నాయక్ అంత్యక్రియలకు పెద్దఎత్తున ప్రముఖులు హాజరవనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి , రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు ఈ నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సామాన్య ప్రజల సందర్శనార్థనం మురళీనాయక్ పార్థవదేహాన్ని ఉంచుతారు. ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు కుటుంబ సభ్యులు అంత్యక్రియ ఏర్పాట్లు చూస్తారు. ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు మిలిటరీ శర్మనీ ఉంటుంది. ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రముఖుల సందర్శనార్థం సమయమిస్తారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. 11 గంటల నుంచి 11.30 మధ్య ప్రముఖుల నివాళులు ఉంటాయి. 11.30 గంటల నుంచి 12 గంటల మధ్య పోలీసు, మిలటరీ గన్ సెల్యుట్ పూర్తవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల మధ్య మిలటరీ అధికారులు కుటుంబ సభ్యులకు జాతీయ పతాకాన్ని అందజేస్తారు. 12.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య అంత్యక్రియలు పూర్తవుతాయి.

పుట్టపర్తి రూరల్ : భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ అంత్యక్రియలకు రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్, వంగలపూడి అనిత హాజరుకానున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కళ్లి తాండ స్వగ్రామానికి మురళి నాయక్ భౌతికకాయం శనివారానికి చేరుకుంది. ఈసందర్భంగా గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు . పాక్ జరిపిన కాల్పుల్లో మరణించిన నేపథ్యంలో అధికారిక, సైనిక లాంఛనాలతో జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు హోంమంత్రి అనిత హాజరై మురళీ నాయక్ పార్థివదేహానికి నివాళి అర్పించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.రత్న ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఈ సందర్భంగా పటిష్ట మైన పోలీస్ భద్రత ఏర్పాట్లు సిద్ధం చేశారు.

గోరంట్ల : దేశ సరిహద్దు లో పాకిస్తాన్ ఇండియా మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళి నాయక్ పార్థవ దేహం శనివారం రాత్రి స్వగ్రామమైన కళ్లి తండాకు మిలటరీ వాహనంలోచేరుకుంది వీర జవాన్ పార్థవ దేహం చూడడానికి సాయంత్రం నాలుగు గంటల నుండి గుమ్మయగారిపల్లి సర్కిల్లో వేలాదిమంది ప్రజలు తరలివచ్చి వీర జవాన్ కు జై భారత్ అంటూ మురళి నాయక్ పార్థ దేహానికి నివాళులర్పించారు. బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుండి రోడ్డు మార్గాన చిక్బల్లాపూర్ మీదుగా పాలసముద్రం సర్కిల్ నుండి గోరంట్లకు జవాను పార్థవ దేహం తీసుకొచ్చారు బెంగుళూరు ఎయిర్ పోర్టు నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత. ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు సైనికుడి పార్థివదేహాన్ని తీసుకొస్తున్న మిలటరీ వాహనం వెంట వచ్చారు వీరు తల్లితండాకు చేరుకొని జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళి నాయక్ పార్థవదేహం చూడడానికి వేలాదిమంది రావడంతో గుమ్మయగారిపల్లి సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో వేలాది వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా ఎస్పీ రత్న పర్యవేక్షించి ట్రాఫిక్‌ను నియంత్రించారు మురళి నాయక్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరుగునున్నట్లు అధికారులు తెలిపారు

నేడు వీరజవాను అంత్యక్రియలు

భారీ ఎత్తున ఏర్పాట్లు

కుటుంబసభ్యులకు ప్రముఖుల పరామర్శ

కళ్లతండాలో వీరజవాను పార్థివదేహం చూసేందుకు వచ్చిన జనం

పార్థివదేహం తీసుకువస్తున్న వాహనం ముందు జాతీయ జెండాతో మంత్రి సవిత,

దేశం కోసం ప్రాణ త్యాగాలకు సిద్ధం

ప్రజాశక్తి-హిందూపురం

దేశం కోసం తామందరం ప్రాణ త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని ముస్లిం ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ లో భాగంగా అసువులు బాసిన అమరవీరుడు మురళి నాయక్ మృతికి సంతాపం తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. ప్రెస్ క్లబ్ నుంచి సద్భవన్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి మురళి నాయక్ విచిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత టిప్పు సుల్తాన్ యునైటెడ్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూఖ్ ఖాన్, మౌలానా అబ్దుల్ మాలిక్, మౌలానా ఉస్మాన్ ఘనీ, జామియా మసీదు సభ్యులు బాబా, అజ్మతుల్లా ఖాన్, ముజీబ్, డైమండ్ బాబా, సెల్ ఫోన్ నూరుల్లా, అమానుల్లా, జహీర్, ముబారక్, ముస్తఫా ఖాన్, అస్లాం, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాను కుటుంబానికి బాలయ్య నెల వేతనం

ప్రజాశక్తి-హిందూపురం

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో మీథిచెందిన జవాను మురళీ నాయక్‌కు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. జవాన్ కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఒక నెల వేతనాన్ని మురళీనాయక్ కుటుంబానికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఈనెల 12న (సోమవారం) మురళీ నాయక్ స్వగ్రామానికి ఎమ్మెల్యే బాలయ్య వ్యక్తిగత కార్యదర్శులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి.. ఆపై బాలయ్య ప్రకటించిన నగదును వారికి అందజేయనున్నారు.

రాజకీయ వేడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేసవి తరహాలోనే రాజకీయ వేడి కూడా పెరిగింది. ఒక వైపు వైసిపి నాయకుల అరెస్టులు, ఆరోపణలపై పోలీసుల చర్యలు కొనసాగాయి. మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ వారంలో అనంతపురం జిల్లాలో పర్యటించారు. సత్యసాయి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనపై వైసిపి నాయకులపై కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఈకేసుల్లో వైసిపి నాయకులను ఈ వారంలో అరెస్టు చేశారు. అదే సందర్భంలో హెలికాప్టర్ పైలెట్‌కు నోటీసులిచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోమారు నోటీసులిచ్చారు. ఆ విచారణ కొనసాగుతున్న క్రమంలోనే వైసిపి నాయకులపైనా చర్యలు కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన న్యాయస్థానం ఆశ్రయించారు. 41 సి నోటీసుల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించడంతో ఆయన అజ్ఞాతం వీడాడు. ఇక తాడిపత్రి నియోజకవర్గం రాజకీయ మరింత వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో ప్రవేశించడానికి అనుమతినివ్వాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుమతినివ్వడంతో ఆయన తాడిపత్రికి వెలుతారన్న విషయం తెలియగానే మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

అడ్డుకుంటామని చెప్పడం ఉద్రిక్తతలకు దారి తీసింది. జిల్లా ఎస్పీని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబున పర్యటన తరువాత తగిన భద్రతతో తాడిపత్రికి అనుమతిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన తరువాత ఇప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఇద్దరి మధ్య పోరులో తాడిపత్రి రాజకీయం మరింతగా వేడెక్కింది. ఈ రకంగా ఈ వారంలో అధికార , ప్రతిపక్ష వైసిపి మధ్య పోరు నడిచి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఉరవకొండ నియోజకవర్గంలో వజ్రకరూరు మండలంలోని ఛాయపురంలో జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఆయన పరిశీలించారు. వచ్చే 50 నెలల్లో ఈ వెడల్పు పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జులై 10వ తేదీన వచ్చి ప్రారంభోత్సవం చేపడతామని తెలిపారు. అదే సందర్భంలో హంద్రీనీవా నుంచి చెరువులకు అనుసంధానం చేసి నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది ఒకింత జిల్లాకు మంచి జరిగే విధంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ పాక్‌తో జరుగుతున్న ఉద్రిక్తతల్లో మృతి చెందారు. అగ్నిపథ్‌లో ఎంపికైన మురళీ నాయక్ మృతి చెందడం అందరినీ విస్మయానికి గురిచేసింది. భౌతికకాయం శనివారం స్వగ్రామానికి చేరింది. ఇక ఆర్డీటీకి ఎఫ్‌ఆర్‌సిఎ అనుమతి కోసం ఈ వారంలోనూ పెద్దఎత్తున పోరాటాలు సాగాయి. కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ముఖ్య నేతలు కూడా మాంఛూఫెర్రర్‌ను కలసి అనుమతి కోసం ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు.

బత్తలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

కారు అదుపు తప్పి బోల్తా... తండ్రి, కుమారుడు మృతి

మరో ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి అవుటర్‌రింగ్‌రోడ్డు వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం అనంతపురం వైపు నుండి కదిరి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న పదిమందిలో తండ్రి కుమారుడు మృతి చెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబందించిన పోలీసులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గం టౌన్ చెందిన గాజుల రామ్మోహన్ (సాఫ్ట్వేర్ ఉద్యోగి) తన కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు రాజశేఖర్ రెడ్డి(45)వారి కుటుంబ సభ్యులు, ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్‌తోకలసికళ్యాణదుర్గం నుండి తిరుమల వెంకటేశ్వర స్వామి దైవదర్శనం కోసం శనివారం ఉదయం బయలు దేరారు. బత్తలపల్లి సమీపంలోని వై జంక్షన్‌కు కొద్ది దూరంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో నడుపుతున్న రామ్మోహన్, కారులో ఉన్న రామ్మోహన్ భార్య మాధవి, వీరి కుమార్తెలు సాన్విక, జశ్విత,కౌటిల్ కుమార్, స్నేహితుడు రాజశేఖర్ రెడ్డి, ఆయన భార్య దీపిక, కుమారుడు యస్విత్ రెడ్డి, కుమార్తె వీరాధ్య, మరో స్నేహితుడు ప్రశాంత్‌కుమార్ గాయపడ్డారు. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి పోయారు. రోడ్డుపై వెళ్లేవారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు బత్తలపల్లి పోలీసులు 108 సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజశేఖర్ రెడ్డి (47), అతని కుమారుడు యశ్విత్ రెడ్డి (7) మతి చెందారు. ప్రశాంత్ కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మిగిలిన వారు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు రాజశేఖర్ రెడ్డి భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి ఎఎస్ఐ రమేష్ తెలిపారు.

బోల్తాపడిన వాహనం

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

జవాను మృతికి పలువురు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

దేశసరిహద్దులో పాకిస్తాన్ కాల్పుల్లో మృతి చెందిన వీర జవాను మురళినాయక్‌కు సిపిఎం ఆధ్వర్యంలో అశ్రునివాళి అర్పించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మురళినాయక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, మారుతి మాట్లాడుతూ సరిహద్దులో దేశ రక్షణ విధుల్లో ఉన్న మురళినాయక్ పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీర మరణం పొందారన్నారు. జవాను కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమలో సిఐటియు నాయకులు జెవి.రమణ, అయూబ్‌ఖాన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వీర జవాను 'ఉపాధి' కూలీల నివాళి

సోమందేపల్లి : మండలంలోని మాగేచెరువులో ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు ఆధ్వర్యంలో పని ప్రదేశంలోనే ఉపాధి కూలీలు జవాను మురళినాయక్ మృతికి నివాళులర్పించారు. కూలీలు మాట్లాడుతూ శత్రు దేశం పాకిస్తాన్ కాల్పుల్లో జవాను మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధి మేట్ రాధమ్మ, అనిత, శివకుమార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో..

సోమందేపల్లిలో ఉపాధి పని ప్రదేశం వద్ద నివాళులర్పిస్తున్న కూలీలు

జవాను మురళినాయక్ 1 నుంచి పదో తరగతి వరకూ చదివిన స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. వీర జవాను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మౌనం ఘటించారు. వారు మాట్లాడుతూ మురళి నాయక్ దేశం కోసం ప్రాణాలర్పించడం గర్వంగా ఉందన్నారు. ఎంతో పట్టుదలతో ఉద్యోగం సాధించి చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీరు మున్నీరయ్యారు.

తనకల్లు : శత్రు దేశం పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళినాయక్‌కు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో కూటమి, ప్రజా సంఘాలు కొక్కంటి క్రాస్ యువత ఆధ్వర్యంలో నివాళులర్పించి, శాంతి ర్యాలీ నిర్వహించారు. మురళినాయక్, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బాలసముద్రం ఎంపీటీసీ, అమర్ కార్తికేయ, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సంకు వెంకటరమణ, మల్లికార్జున, శ్రీధర్, విశ్వనాథ్, ముస్తఫా, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : జవాను మురళినాయక్ మృతికి ఎస్‌టియు జిల్లా శాఖ పక్షాన సంతాపం ప్రకటించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ శత్రువుల కాల్పుల్లో వీరమరణం పొందిన మురళినాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరువదన్నారు.

పెనుకొండ : జవాను మురళినాయక్ మృతికి సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక దర్గా సర్కిల్ బాబా ఆటో స్టాండ్‌లో నివాళు లర్పించారు. సిపిఎం నాయకులు హరి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, సత్తార్‌బాబా, అమన్, ఇనాయత్ పాల్గొన్నారు.

పెనుకొండలో సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పుట్టపర్తి క్రైమ్ : స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఉన్న లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఆ సంఘం నాయకులు జవాను మురళినాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన రహదారి కూడలిలో మురళినాయక్ స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్‌నాయక్, మండల అధ్యక్షులు రమణనాయక్, నాయకులు గణనాయక్, నారాయణస్వామి నాయక్, చంద్రశేఖర్‌నాయక్, రమేష్‌నాయక్, రవీంద్రనాయక్, సోమ్లానాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నల్లమాడ : జవాను మురళినాయక్ మృతికి నివాళిగా టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో నాగభూషణం, ప్రకాష్, రామయ్య, డీలర్ నరసింహులు, కేశవరెడ్డి, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే సిపిఎం ఆధ్వర్యంలో జవాను మురళినాయక్ మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవిందు, మల్లికార్జున, రాజు, రామయ్య, పాల్గొన్నారు.

హిందూపురం: పాక్ సైనికుల కాల్పుల్లో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి, నినదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కన్వీనర్ అఫ్రిది, కో కన్వీనర్ అజ్మల్, వినీత్ వినీత్, హుజాఫా, తరుణ్, పవన్, సాయి, రజిక్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డే సతీష్

పి నరేష్

తలారి చంద్రమోహన్

దేశ సేవలో సోమందేపల్లి జవాన్లు

ప్రజాశక్తి-సోమందేపల్లి

దేశ సరిహద్దులో సోమందేపల్లికి చెందిన ముగ్గురు జవాన్లు తమ సేవలు అందిస్తు న్నారు. ముగ్గురు జవాన్లు ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ ప్రాంతంలో పని చేస్తున్నారు. వారిలో షిరిడినగర్‌కు చెందిన వడ్డే శ్యామలమ్మ, వడ్డే నారాయణప్ప దంపతుల ఏకైక కుమారుడు వడ్డే సతీష్ ఒకరు. సతీష్ తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ విద్యా బుద్ధులు నేర్పించారు. సైన్యంలో పని చేయాలనే లక్ష్యంతో సతీష్ పట్టుదలతో చదివి ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ఏడాదిగా జమ్మూకాశ్మీర్‌లోని రజో రియా ప్రాంతంలో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో జవాను పి.నరేష్ షిరిడీనగర్‌కు చెందిన జయమ్మ, గోపాల్ దంపతుల ఏకైక కుమారుడు. ఇతను ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లోని బరాముల్లా ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. నరేష్ తల్లి కడుపులో ఉన్నప్పుడే తండ్రి గోపాల్ కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. జయమ్మ చేనేత కార్మికురాలిగా పని చేస్తూ కుమారుడు, కూమార్తెను ఉన్నత చదువులు చదివించింది. నరేష్ ఎంబిఎ చదువు తుండగా ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. కుమా రుడు సైనికుడిగా పని చేయడం చాలా గర్వంగా ఉందని, అయితే ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మనసులో ఆందోళనగా ఉందని తల్లి జయమ్మ పేర్కొన్నారు. మరో జవాన్ చంద్రమోహన్ స్థానిక పాతఊర్లో నివాసం ఉంటున్న తలారి నరసింహులు, లక్ష్మీ నరసమ్మ కుమారుడు. వీరికి నలుగురు సంతానం కాగా ముగ్గురు మహిళలు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ అందరినీ బాగా చదివించారు. చంద్రమోహన్ డిగ్రీ చదువుతుండగా మిల్ట్రీలో ఉద్యోగం రావడంతో ఏడేళ్లుగా సైనికుడిగా పని చేస్తున్నాడు. రెండేళ్లుగా జమ్మూ ప్రాంతంలో పని చేస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని నియోజకవర్గ టిడిపి నాయకులు వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను హెచ్చరించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం పెనుకొండ, సోమందేపల్లి మండలాల కన్వీనర్లు శ్రీరాములు, సిద్ధలింగప్ప, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, బిజెపి నాయకులు రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాల గురించి ఉషశ్రీ అవగాహన లేకుండా మాట్లాడడం శోచనీయమన్నారు. శిక్షణ పూర్తి కాకనే కుట్టు మిషన్లు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. శిక్షణ కాలం పూర్తి కాకుండానే ఎలా స్కాం జరుగుతుందో ఉషశ్రీకే తెలియాలని ఎద్దేవా చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవిత దాదాపు రూ. 30 కోట్లతో సిమెంట్ రోడ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అవినీతి చేసి అక్కడ తరిమితే పెనుకొండకు వచ్చి రాజకీయం చేస్తున్న ఘనత ఉషశ్రీదే అన్నారు. ఉషశ్రీ అవినీతి, అక్రమాలపై కళ్యాణదుర్గంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సప్తగిరి, జనసేన బాబావలి, నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రంగనాయకులు, సుబ్రహ్మణ్యం, కురుబ నంజుండ, షమూన్, షమి, వడ్డి నాగప్ప, వడ్డి చంద్ర, బోయ చెంద్రాయుడు, సోము, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

బహుళ ప్రయోజన గోదాము ప్రారంభం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గ్రామీణ, వ్యవసాయ రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని గొట్లూరు గ్రామంలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన బహుళ ప్రయోజన గోదామును శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. నాబార్డ్ సహకారంతో గొట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ గోదామును నిర్మించార న్నారు. వ్యవసాయ దిగుబడులు నిల్వ, ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ వృద్ధి, రైతులకు మంచి ధర లభించేందుకు, తదితర అవసరాలకు ఇది ఎంతో ఉపయోగపడు తుందన్నారు. రైతుల సాధికారత, రైతు సంఘాల స్థాయిని పెంచేందుకు అన్ని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, సొసైటీ సీవో, అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, సాకే చంద్ర, కంచం లీలావతి, అనిల్, రైతులు పాల్గొన్నారు.

గోదామును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

కవి వెంకటేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి డైరెక్టర్ ఆఫ్ ఆర్ట్ స్టూడెంట్స్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన పల్లె జానపద జాతర' కార్యక్రమంలో పట్టణానికి చెందిన కవి నక్కల వెంకటేష్ జానపద గేయాలు ఆలపించారు. దీంతో వెంకటేష్‌కు జానపద కళా వేదిక అధ్యక్షులు తిరుపతి అరవ జయపాల్ జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. నక్కల వెంకటేష్ మాట్లాడుతూ మరుగున పడిపోతున్న పల్లె జానపద గీతాలను ప్రజల్లోకి తేవడానికి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తనకు అవకాశం ఇవ్వడం, కవుల ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఈతకెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ శివారులోని రేగాటిపల్లి రహ దారిలో ఉన్న ఈత కొలనులో ఈతకు వెళ్లి శనివారం బాలుడు మరణించిన ఘటన స్థానికులను కలచివేసింది. వివరాలు.. అనంతపురం జిల్లాలోని కల్లూరు మండల కేంద్రానికి చెందిన సంజీవనా యుడు తన కుమారుడు నందీశ్వరనాయుడు(9)తో కలిసి ధర్మవరంలో జరుగుతున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలకు వచ్చారు. ఈ క్రమంలో నందీశ్వరనాయుడు పట్టణ శివారులోని రేగాటిపల్లి రహదారిలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై టౌ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జవాను మురళినాయక్ త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి-కదిరి టౌన్

దేశ సరిహద్దులో పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం పొందిన మురళినాయక్ త్యాగం మరువ లేనిదని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కొనియాడారు. జవాను మురళినాయక్ మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశం కోసం వీర మరణం పొందిన మురళినాయక్ త్యాగం జీవితాంతం గుర్తుండి పోతుందన్నారు. వీరజవాను అంతిమయాత్రకు నియోజవర్గ వ్యాప్తంగా భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న సైనికులకు దేశం మొత్తం అండగా ఉంటుందని తెలిపారు. వీర జవాను అంతిమ యాత్రలో పాల్గొనేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే సుమారు వంద వాహనాలు ఏర్పాటు చేశారు.

కర్నాటక సరిహద్దులో వేచి ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు

పార్థివదేహానికి స్వాగతం పలికిన ఎంపి, ఎమ్మెల్యేలు

కదిరి అర్బన్ : వీరజవాను మురళి నాయక్ పార్థివదేహానికి కర్నాటక సరిహద్దు వద్ద ఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజు స్వాగతం పలికారు. జవాను పార్థివదేహాన్ని బెంగళూరు విమానాశ్రయం నుంచి తీసుకొస్తుండగా కర్నాటక సరిహద్దు వద్ద వారు స్వాగతం పలికి నివాళులర్పించారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

మడకశిర : పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి 28 మంది లబ్ధిదారులకు రూ. 10.92 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజే శారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలన లో జగన్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కేవలం రాజకీయం కోసమే ఈ ప్రాంతాన్ని వాడుకున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే సిఎం సహాయ నిధిని సైతం స్వాహా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, నాయకులు పాండురంగప్ప, నరసింహులు, గంగాధర్, హనుమంతు, పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-మడకశిర

భారతదేశ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శనివారం పట్టణంలో ఎమ్మెల్యే ఎమ్మెస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యం లో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంత భవనం వద్ద నుంచి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అణచివేసే దిశగా భారత ప్రభుత్వం, సైన్యం తలపెట్టిన ఆపరేషన్ సింధూర్‌ను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో స్వాగతిస్తున్నారన్నారు. అంతకుముందు ఆర్అండ్‌బి అతిథి గృహంలో జవాను మురళినాయక్ మృతికి నివాళులర్పించారు. మురళినాయక్ అమర్ రహే.. భారత్ మాతాకీ జై.. జై జవాన్ నినాదాలు చేశారు. ర్యాలీలో ఉద్యోగ సంఘాలు, పట్టణ ప్రజలు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, నాయకులు పాండురంగప్ప, నరసింహులు, గంగాధర్, హనుమంతరాయప్ప, మంజునాథ్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, పురుషోత్తం, నరసింహ మూర్తి, కౌన్సిలర్లు రాజా, ఉమాశంకర్, శ్రీనివాస్, నాగేంద్ర, విక్రమ్, దాసప్ప, బలరాం, శ్రీనివాసులు, వెంకటలక్ష్మమ్మ, సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ చేపట్టిన టిడిపి నాయకులు

కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివిఎల్. నరసింహులు డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను శనివారం పట్టణంలో విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు కల్పించి రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని, స్కీం వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, జగన్, రామ్మోహన్, ముస్తాక్, ప్రజా సంఘాల నాయకులు మావున్నీసా, సుజాత, ఫక్రుద్దీన్, శివ, తిరుపాలు, బాలకృష్ణ, మండల కన్వీనర్లు రామకృష్ణ, వేమన్న, మహబూబ్‌బాషా, అక్కులప్ప, నాగరాజు పాల్గొన్నారు.

సమ్మె బుక్‌లెట్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

చిలమత్తూరు : జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మే 15వ తేదీ లోపు డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. టెట్ మార్కుల జాబితా, నివాస, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో జిల్లా కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

శివాలయానికి విరాళం

తలుపుల : బత్రేపల్లి శ్రీచౌడేశ్వరి దేవి ఆలయం, శివాలయం పున్ఃనిర్మాణం కోసం శనివారం మండలంలోని పలవాండ్లపల్లి గ్రామానికి చెందిన దేరంగుల గంగరాజు రూ. 10,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ, బత్రేపల్లి ఆలయ కమిటీ రాము, రాజశేఖర్‌బాబు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే.శ్రీనివాసులు అధ్యక్షతన పట్టణంలోని ఆర్‌డిఒ ఆఫీస్ ఎదురుగా నిరసన కార్యక్ర మం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.అశోక్‌కుమార్ మాట్లా డుతూ 9 రకాల పాఠశాలల విధానాన్ని ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకూ కొనసాగించాలన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ 117 జీవోను వెంటనే రద్దు చేయా లన్నారు. గౌరవాధ్యక్షుడు పివి మాధవ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యం లేకపోవడం దురదృష్టకరమని, తెలుగు మాధ్యమాన్ని కొనసాగిం చాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాలు మాట్లా డుతూ వెంటనే పిఆర్సి కమిటీని నియమించాలని, పెండింగ్ డిఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సబ్ కమిటీ నెంబర్లు నారాయణ, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, రఫీ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశివ, వెంకటనాయుడు, హరిప్రసాద్, వెంకటరమణనాయక్, ఈశ్వరప్ప, సేవినాయక్, చంద్రమౌళి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన ఉపాధ్యాయ సంఘాలు

డ్రిప్ ఫిల్టర్లు ధ్వంసం

రొద్దం : మండలంలోని మోపర్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రైతు కురుబ రామాంజనప్పకు చెందిన పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు డ్రిప్ పిల్టర్లు కాల్చివేశారు. రైతు డ్రిప్ సాయంతో ఎకరాలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఫిల్టర్లను సైపాన్ నుంచి తొలగించి వాటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు బాధితుడు వాపోయాడు. దుండగు లను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరాడు.

వృద్ధ, అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-తనకల్లు

కదిరి పట్టణానికి చెందిన కొత్తపల్లి ముత్తిరెడ్డి, లలితమ్మల మనవరాలు ఆరాధ్య పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక వృద్ధ, అనాథాశ్రమంలో శ్రీసాయి సేవా ట్రస్ట్ ద్వారా వృద్ధులకు దుస్తులు అందజేసి భోజనం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మనవరాలు పుట్టినరోజున ఇలాంటి కార్యక్ర మం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముత్తిరెడ్డి, ఆశ్రమ నిర్వాహకురాలు తులసమ్మ, శివరామిరెడ్డి, నరేంద్రరెడ్డి, హరి, శారదమ్మ, అనసూయమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

12 నుంచి టిడిపి మండల కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ మండల కమిటీలు, అనుబంధ విభాగాలకు నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కమిటీలతో పాటు తెలుగు యువత, ఐటీడీపీ, తెలుగు రైతు, తెలుగు మహిళ, కల్చరల్, డాక్టర్స్ వింగ్, మైనార్టీ, క్రిస్టియన్, దివ్యాంగ కమిటీలను ఎన్నుకుంటామన్నారు. 12వ తేదీ అమడ గూరు, ఓడిసి మండల కేంద్రాల్లో, 13న ఉదయం నల్లమాడలో, మధ్యాహ్నం పుట్టపర్తి టిడిపి కార్యాల యంలో బుక్కపట్నం మండల కమిటీలను ఎన్నుకుంటామన్నారు. 14న ఉదయం కొత్తచెరువులో, మధ్యాహ్నం పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో పుట్టపర్తి రూరల్ మండలానికి, 15న పుట్టపర్తి మున్సి పాలిటీకి సంబంధించి టిడిపి కార్యాలయంలో ఎన్నుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల నాయ కులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీ ఎన్నికకు సహకరించాలని వారు కోరారు.

భక్తులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

ధర్మవరం రూరల్ : పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివా రం తేరు పండుగ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు డిష్ రాజు ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి కొద్దిసేపు భక్తులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయ కుడు సందా రాఘవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రభుత్వ నిబంధనలను అతిక్ర మించిన నారాయణ, శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తూ శనివారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల వద్ద ధర్నా చేపట్టారు. పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ ఆయా విద్యాసంస్థలు ముం దస్తు ప్రచారం, అడ్మిషన్లు నిర్వహించడంతో పాటు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, టై, షూ, ఇతర సామగ్రి విక్రయిస్తున్నాయన్నారు. అనుమతులు లేకపోయినా ఎల్‌కెజి, యుకెజి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. డిఇఒ ఆ పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని, లేనిచో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ధర్నాలో నాయకులు హర్షకుమార్, భగత్, సాయిరామ్, జగదీష్, అభిషేక్, బాబా, సాధిక్, హితీష్, అశోక్‌కుమార్, రూపేష్ పాల్గొన్నారు

పాఠశాల ముందు ధర్నా చేపట్టిన పిడిఎస్‌యు నాయకులు

ఆదర్శప్రాయురాలు హేమారెడ్డి మల్లమ్మ

పావగడ : సామాన్యుల కుటుంబంలో జన్మించిన హేమారెడ్డి మల్లమ్మ చిన్నతనం నుంచే శ్రీశైల మల్లికార్జున స్వామిని పూజించి ఆయన అనుగ్రహంతో ఆదర్శంగా నిలిచారని తహశీల్దార్ వరదరాజులు పేర్కొ న్నారు. హేమారెడ్డి మల్లమ్మ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని తాలూకా కార్యాలయంలో తహశీల్దార్ మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మల్లమ్మ సాధించిన విజయాలకు గుర్తుగా కర్నాటక, ఆంధ్ర, తెలంగాణలో జయంతి ఉత్సవం నిర్వహి స్తారన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి రామాంజనరెడ్డి, సన్న రామారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పెద్దిరెడ్డి, చింతలారెడ్డి పాల్గొన్నారు.

వీరజవానుకు అడుగడుగునా అశ్రునివాళి

ప్రజాశక్తి-చిలమత్తూరు

దేశ సరిహద్దులో శత్రు దేశం పాక్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాను మురళినాయక్ పార్థివదేహం శనివారం బెంగళూరులోని సైనిక ఆసుపత్రి నుంచి స్వగ్రామానికి తరలించారు. మార్గమధ్యలోని బాగేపల్లి టోల్ గేట్ వద్ద వేలాది మంది ప్రజలు మురళినాయక్ పార్థివ దేహాన్ని చూడడానికి తరలివచ్చారు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఎంపిలు బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, ఎమ్మెస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం మురళినాయక్ స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళినాయక్ త్యాగం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రజలు తెలిపారు.

కర్నాటకలో జవాను చివరి చూపు కోసం వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

కల్తీ కల్లు అమ్మే వారిపై ఫిర్యాదు

రొద్దం : అనుమతులు లేకుండా, కల్తీ కల్లు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కెవిపిఎస్ నాయకులు ఎస్ఐ నరేంద్రకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కర్నాటక సరిహద్దులో మండలం లోని చెరుకూరు గ్రామంలో ఎలాంటి లైసెన్సు లేకుండా కొందరు కల్తీ కల్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు న్నారని వాపోయారు. ఇటీవల కర్నాటకలోని మురారిపల్లికి చెందిన నంజుండప్ప వీరి వద్ద కల్తీ కల్లు తాగి మృతి చెందాడని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, కార్యదర్శి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, అంజన్న, సిపిఎం మండల కార్యదర్శి దేవి, అంజ నప్ప, ప్రసాద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై వీధి నాటక ప్రదర్శన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సరోజమ్మ కళా బృందం సభ్యులు పట్టణంలోని ప్రధాన మార్కెట్ సర్కిల్‌లో వీధి నాటకాల ద్వారా చక్కగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మవరం వైద్యాధికారి డాక్టర్ నజీర్, ఐసిటిసి కౌన్సిలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి, శక్తి మైత్రి మహిళా సంఘం పియు ధర్మవరం ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్‌కుమార్, ఒఆర్‌డబ్ల్యు త్రివేణి, లక్ష్మీ, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

పౌర భద్రతపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి-పావగడ

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతా వరణం నెలకొన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా శనివారం పావగడలో అగ్నిమాపక, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పౌరుల భద్రతపై మాక్ డ్రిల్ చేపట్టారున. ప్రజలు తమ ప్రాణాలు కాపాడు కోవడంతో పాటు, ఇతరులను ఎలా కాపాడుకో వాలనే అంశాలపై పట్టణంలోని శనిమహాత్మ సర్కిల్, కొత్త బస్టాండ్‌లో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ సురేష్, ఎఎస్ఐ తిమ్మరాజు, ఈశ్వరప్ప, ఉమేష్, వెంకటేష్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.